## జపాన్ కథ

ఇవాల్టి రాత్రి కలలో మళ్ళీ పులిపిరి కాయ కన్పించింది. ఆ కాయ వల్లే మీరు చాలా సార్లు చివాట్లు పెట్టారు. అది నా కుడి భుజం మీద, వీపు నైపు, మెడకి దగ్గరగా వుంది.

'అసలే అది బఠానీ గింజ అంత పెద్దది. దానితో నువ్వు అలా ఆడుకుంటూ వుండు. ఆ పక్కనే మరికొన్ని కాయలు లేస్తాయి' గుండ్రంగా ఉబ్బినట్టున్న దానిని చూపి ఇది పులిపిరి కాయ కంటే పెద్దదని కూడా మీరన్నారు.

నా బాల్యంలో నిద్రపోయే ముందు దీనితో ఆడుకునేదాన్ని. మొట్టమొదట మీరు దాన్ని చూపినపుడు నాకేమనిపించిందో తెలుసా- నేను ఏడ్చేశాను. మీరు ఆశ్చర్యపోయారు. అదంతా ఇప్పటికీ నాకు గుర్తుంది.

'ఇంక చాల్లే సాయొకో! నువ్వలా పట్టుకుంటూ వుంటే అది పెరుగుతూనే వుంటుంది' అని మా అమ్మ కూడా చివాట్లు పెట్టింది. అప్పుడు నేను చిన్నదాన్ని. పదమూడేళ్ళు వుంటాయి. దాన్ని పట్టుకోవడం నాకో అలవాటైపోయింది.

*　　*　　*　　*

మీరు దాన్ని మొట్టమొదట చూపినపుడు నేనప్పటికి చిన్నదాన్ని. మన పెళ్ళి కాలేదు. మగవాడిగా మీరు నన్ను సిగ్గుపడేటట్లు చేస్తారని అనుకోలేదు. అప్పట్లో నాకు పెళ్ళంటే పెద్ద భయం.

అంతవరకూ దాచుకున్న నా రహస్యాలన్నీ బయట పడినట్టనిపించింది.. నా విషయాలన్నీ ఒక్కటొక్కటే నీకు తెలిసిపోయినట్టనిపించింది. దాచుకోవడానికి నా దగ్గర ఇంకేమీ మిగలలేదు.

మీరు ఆనందంగా నిద్ర పోయారు. నాకప్పుడు కాస్త ఊరట, ఏకాంతం లభించాయి. ఆ సమయంలో కూడా అనుకోకుండానే నా చెయ్యి పులిపిరికాయ మీదకి వెళుతూ వుండేది... అలవాటయిపోయింది కదా!

'నేనింకా దీనిని తాకను' అని మా అమ్మకు ఉత్తరం రాయాలనుకున్నాను. కాని ఆలోచిస్తున్నకొద్దీ కోపం ఎక్కువయ్యేది. ఏం చేయను? గత్యంతరం లేదు.

'తెలివి తక్కువ కాకపోతే పులిపిరికాయ గురించి ఇంత ఆలోచనా!' అని మీరొకసారి అన్నారు. ఆనందంగా తల ఆడించాను. మీరు నా ఈ చెడు అలవాటుని ఇంకొంచెం ప్రేమించి వున్నట్టయితే ఎంత బావుణ్ణని అనుకుంటాను.

పులిపిరి కాయ గురించి నాకంత చింత లేదు. నిజమే, నాకు తెలియకుండానే ఎడమ చేతిని వాడుతుంటాను.

'ఇది నీ కుడి భుజం మీదుంది. అంచేత కుడి చెయ్యి అయితే బావుంటుంది.'

'ఊ' అంటూ కుడి చేతిని మీదికెత్తాను. నాకేమిటో అదోలా అనిపించింది.

'ఎలాగూ అనిపించదు'

'కానీ ఎడమ చెయ్యి అయితే నాకెంతో తేలికగా వుంటుంది.'

'దానికంటే కుడి చెయ్యి దగ్గర కదా!'

ఏమిటో, మీ మాటల్ని మనసా అంగీకరించలేక పోతున్నాను... మీ పట్ల కఠినంగానే వుంటున్నాను.

'ఎడమ చేయి అయితే అభ్యంతరమా?' నెమ్మదిగా అడిగాను.

'చెయ్యి ఏదైనా ఆ అలవాటు మంచిది కాదంటాను.'

రచన: నోబెల్ బహుమతి గ్రహీత యాసునారి కవాబాతా

హిందీ అనువాదము: కేవల కృష్ణశర్మ

తెలుగుసేత: కాలిపు వీరభద్రుడు

ఆడవాళ్ళ మెడ మీద వున్న పులిపిరి కాయల్ని వెదకడమే దోషం పనా! అందం చందం లేని అమ్మాయిల్ని గురించి అనుకుంటారు కాని పులిపిరి ఎంత పెద్దదున్నా అందవికారం అనిపించుకోదు కదా!

పులిపిరిని పట్టుకునే ఈ అలవాటంటే మీ కెందుకంత కోపం? 'ఈ అలవాటు మానుకో' అని అంటారు. మీరెన్నిసార్లు చీవాట్లు పెట్టారో లెక్కే లేదు.

'ఎడమ చెయ్యేనా నీకు పని చేస్తూంది?' నన్నొకసారి కోపంతో అడిగారు. 'నా ఎడమ చెయ్యా!'- ప్రశ్న విని త్రుళ్ళిపడ్డాను.




'తెలుసు'

'డాక్టర్ దగ్గరకెళ్ళి కోయించుకోమని ఎన్నిసార్లు చెప్పానో'

'నే వెళ్ళను బాబూ, సిగ్గేస్తుంది. అయినా పులిపిరి కాయ కోయించుకోడానికి ఎవరన్నా వెళ్తారా డాక్టరు దగ్గరికి?'

'బోలెడంతమంది.'

'ఏ నుదిటి మీద కాయను కోయించుకోడానికో అవచ్చు, అంతేకాని మెడమీద కాయ కోసమని నేనను కోను. అదీకాక డాక్టరు ఎగతాళి చేయవచ్చు. 'ఆ కాయంటే ఈమె భర్తకు ఇష్టం లేదు. అందుకే డాక్టరు దగ్గరకువచ్చింద'ని అనుకోవచ్చు కూడా.'

'ఈ కాయతో ఆడుకునే అలవాటు నీకుందని చెబుతావు.'

'ఈ కాయనగా ఎంతుంది? వున్నా, మీకు కనిపించని చోట వుంది. నా మీద మీకెంత ప్రేముందో అర్థమయిందిలేండి.'

'ఆ కాయ గురించి కాదు నేననేది. దాంతో ఆట మానేస్తావని.'

'మానెయ్యాలనే... కాని ఉండలేకపోతున్నాను.'

'నువ్వు మొండివి. ఎన్ని చెప్పినా నిన్ను నువ్వు సరిదిద్దుకోవడానికి ఒప్పుకోవు.'

'ప్రయత్నిస్తాను. దాన్ని తాకకుండా వుండాలనే మెడ వరకూ వుండే గౌన్లు వేసుకుంటున్నానా?'

'ఏదో కొంచెం సేపు మానేస్తావు. ఆ తర్వాత మామూలే.'

'దాన్ని పట్టుకోవడం అంత చెడు అలవాటా!' మీతో జగడమాడుతున్నానా అనిపించింది.

'అలాగని కాదనుకో. కాని నాకది యిష్టముండదు.

అంచేతనే ఆ అలవాటు మానుకోమని చెబుతూంట.'

'అయినా మీకెందుకంత అయిష్టం?'

'కారణం చెప్పవలసిన అవసరం లేదు. దాంతో నువ్వు ఆడడం మానెయ్యాలి. అది చెడు అలవాటు. మానుకోమని నా ఉద్దేశ్యం.'

'మానవని నేనెప్పుడూ అనలేదే...'

'నువ్వు దాన్ని ఫట్టుకున్నప్పుడల్లా నీ ముఖంలో విచిత్రమైన భావాలు కన్పిస్తాయి. అప్పుడా ముఖం వికృతంగా వుంటుంది. అలాంటి భావాలంటే నా కసహ్యం.'

మీరు చెబుతూంది నిజమేనేమో — అనిపించి ఔనన్నట్టు తల ఆడించాలనుకున్నాను.

'ఈసారి నేనలా చేస్తే నా చేతిమీద ఒక్క దెబ్బ కొట్టండి. నా ముఖం మీద కూడా.'

'ఈ చిన్న అలవాటు మానుకోడానికి రెండు మూడేళ్ళ నుంచి నువ్వు చేస్తున్న నీ ప్రయత్నంలో ఏ మాత్రం ఫలితం కనిపించలేదని నువ్వు అనుకోవేలేదా?

సమాధాన మివ్వలేదు నేను. 'అలాంటి భావాలంటే నా కసహ్యం' అనే మీ మాటల్ని గురించి ఆలోచిస్తున్నాను.


నా కుడిచేతిని ముందు నుంచి తీసి మెడ దగ్గరికి తెస్తున్నప్పుడు విచిత్రమైన అంద వికారం నా ముఖంలో కనిపించవచ్చు. ఈ విషయంలో 'అద్వితీయం'లాంటి గొప్ప పదాన్ని వాడదలచలేదు. తన ఉనికిని కాపాడుకుంటున్న సమయంలో స్త్రీ అలవాటు విచిత్రంగాను, వికృతంగాను కనిపిస్తుంది. నా ముఖంలోని ఆ 'భావాలు' అలాంటి సందర్భంలోనే కనిపిస్తూ వుండొచ్చు.

మీ ముందు నన్ను నేను సమర్పణ చేసుకొన్నానన డానికి ఇది గుర్తు కాదా! లేదూ, పులిపిరితో నేనాడుకొనేటప్పుడు నా ముఖంలో కనిపించిన భావాలు నా బాల్యం నాటి పులకరింతలకు సంకేతాలు కాదా!...

నాయీ నీచమైన అలవాటు మీ కిష్టం లేకపోవడం కూడా మీ 'అసహ్యానికి' ఓ కారణం కావచ్చు. మీరు నాయందు సంతుష్టులయే వుంటే నవ్వుతూ అతి తేలికగా ఈ విషయాన్ని పక్కకు నెట్టేసేవారు గదా. చాలా మంది మగవాళ్ళు ఈ అలవాటుని కూడా ఓ అలవాటుగా ప్రేమిస్తూ వుండవచ్చు అనే ఆలోచన రాగానే వణికిపోయాను. ఇది ఎంతగానో భయాన్ని కలిగించే ఆలోచన. •




● పులిపిరికాయని కొన్ని ప్రాంతాలలో వల్లకాయ అంటారు




మొట్టమొదట మీరు దాన్ని చూసినప్పుడు నా యందు మీకు ప్రేమభావ ముండేది. ఆ విషయంలో ఇప్పటికీ నాకు అనుమానం లేదు. కాని ఈ చిన్న అసంతుష్టే పెరిగి పెరిగి మన దాంపత్య జీవితాన్ని కలచివేసేటంత వికృతంగా మారిపోయింది. మంచి భార్యాభర్తలు తమ బలహీనలను ఇంతగా పట్టించుకోరు. ప్రతి విషయంలోనూ తప్పులు వెదికే భార్యాభర్తలూ లేరని కాదు. అయితే, ఒకర్ని ఒకరు అర్థం చేసుకున్నా వారు ప్రేమగా వుంటున్నారని, కలహప్రియులు ఒకర్ని ఒకరు ద్వేషించుకుంటున్నారని నా ఉద్దేశం కాదు. పులిపిరి కాయతో ఆడుకొనే నాయీ అలవాటుని మరిచి పోయే స్థితికి మీరు వచ్చి వుంటే ఎంత బావున్నో గదా అనే నా ఆలోచన సరియైనదనే నేననుకుంటున్నాను.

* * *


నన్ను కొట్టాలని, చితక బాదెయ్యాలని మీరు వచ్చేరు! ఏడ్చేశాను. కొంచెం ఓపిక పట్టండని మిమ్మల్ని అడిగాను. నేనీకాయని పట్టుకుంటున్నాననే మీరు నన్ను ఇంతగా సతాయిస్తున్నారా? ఇదొక నెపం మాత్రమే.

'దీన్నెలా బాగుచేయించుకొంటావు?' అని మీరు కంపించే స్వరంతో అడిగేరు. మీ ఉద్దేశం నాకు పూర్తిగా అర్థమయింది. అయినా మీరేం చేసినా నేను అడ్డు పెట్టలేదు. నేనీ విషయం ఎవరితో చెప్పినా మిమ్మల్నొక చెడ్డ భర్తగా అనుకుంటారు. కాని మనమిప్పుడు ప్రతి చిన్న విషయాన్నీ సాగదీసుకొనే పరిస్థితికి వచ్చేశాం. మీరు కొట్టడంతో నాకు ఓదార్పు, ముక్తి లభించినట్టనిపించింది. ఇది నిజం.

'నేనెప్పుడూ అలా చెయ్యనుగాక చెయ్యను. నా చేతులు కట్టేయండి' అని నా రెండు చేతులూ మీ ఛాతీమీద వుంచేను. దాంతో నా సర్వస్వమూ మీకు అర్పించినట్టుగా నాకనిపించింది ...

మీకు ఏమీ పాలుపోలేదేమో, నిలబడిపోయారు. మీ కోపం, భావాలు చల్లబడుతున్నాయి. మీరు నా దారంతో నా చేతుల్ని కట్టేశారు.

కట్టేసిన చేతులతో నేను నా జుత్తు సవరించు కొంటూంటే మీరు సంతోషిస్తూ చూశారు. మిమ్మల్ని చూసి నాకు ఆనందం కలిగింది. 'మంచి పనే జరిగింది.



పాదు అలవాటు. పోడా విరగడవుతూంది...'

అయినా ఇబ్బంది ఇంకా వుండనే వుంది! పులిపిరి కాయను తొలగించడం ... అసంభవం.

ఈ అలవాటు వన్నొదలకపోతే నాయందు మీకున్న అనురాగం, ప్రేమ పోయిందనుకోవాలా? 'నీ యిష్ట మొచ్చినట్టు చేసుకో, అందుకే నేనేమీ మాట్లాడలేద'ని మీరు నాతో చెప్పాలనుకుంటున్నారా? నేను పులిపిరి కాయని ఇటూ అటూ కదుల్చుతున్నప్పుడు మీరు దాన్ని చూడలేదని, దాని గురించి ఫిర్యాదు చెయ్యలేదని అన్నారు.

అప్పుడొక విచిత్రమైన సంఘటన జరిగింది. చీవాట్ల తోను, దెబ్బలతోను నా అలవాటుని పోగొట్టలేని మీ అభిప్రాయాలు మరుగునపడిపోలేదా? వీటిలో ఏ చికిత్సవల్లనైనా లాభం కలగలేదు. 'చికిత్స' లన్నీ వాటంతటవే మనుయిపోయాయి. 'నేనిప్పుడు పులిపిరితో ఆడుకోడంలేదని మీకు తెలియదా?' అని నాకప్పుడే ఆ విషయం తెలిసిందన్నట్టుగా మీతో అన్నాను. మీరు ఏదో గొణుక్కున్నారు. విచారంగా వున్నట్టు వుండిపోయారు. పట్టించుకున్నట్టు కనిపించ లేదు.


ఇదంత పట్టించుకోవలసిన విషయం కానప్పుడు నన్ను మీరు చీవాట్లు వేయవలసిన అవసరం ఎందు కొచ్చిందని అడుగుతున్నాను. 'ఈ అలవాటును ఇంత తొందరగా వదలగలిగేవు కదా, అటువంటప్పుడు మొదట్లోనే నువ్వెందుకు ఈ ప్రయత్నం చెయ్యలేదు' అని మీరడుగుతారని నాకు తెలుసు. కాని మీరు నాతో ఒక్క మాట కూడా అనలేదు ...

ఏ అలవాటువల్లనైతే ఏ విధమైన మార్పూ వుండదో అది ఔషధమూ కాదు, విషమూ కాదు. కావాలంటే దాంతో రోజంతా కాలక్షేపం చేసుకో. — ఈ భావాలు మిమ్మల్ని చూసి చదవొచ్చును. నాకు బాధనిపించింది. దెబ్బ తగిలింది. మీకు కోపం కలిగించడానికి మీ ముందే మళ్ళీ నేను పులిపిరితో ఆడుకోవాలనుకున్నాను. ఎంచేతనోగాని నా చెయ్యి ఆ పని చేయలేదు.

ఒంటరిదాన్నయాననిపించింది. ఒళ్ళు మండింది. మీరు దగ్గర లేనప్పుడు కూడా పులిపిరిని తాకాలని పించింది. కాని ఎందుకో నాకే సిగ్గు అనిపించింది. నా చెయ్యి కదల్లేదు.

కిందికి గచ్చువైపు చూస్తూ పెదవులు కొరుక్కున్నాను.

పులిపిరి గురించి మీరు అడుగుతారని ఎదురు చూశాను. కాని ఆ తర్వాత మన మాటల్లో 'పులిపిరి' మాట కనిపించకుండా పోయింది. దీనితోబాటు మరెన్నో విషయాలు వాటంతటవే సెలవు తీసు



కున్నాయి.

నన్ను సూటిపోటి మాటలంటున్నప్పుడే ఆ ధోర ణికి చికిత్స చెయ్యకుండా ఎందుకూరుకొన్నానో దద్దమ్మని!

* * *

ఇంటికొచ్చి అమ్మతోబాటు స్నానం చేశాను.

"సాయొకో, నీ ఆరోగ్యం బాగున్నట్టు లేద మ్మాయ్!" అమ్మ అడిగింది.

"వయస్సుని తగ్గించుకోలేం గదమ్మా!"

అమ్మని చూసి ఆశ్చర్యపోయాను. ఆమె ఇంతకు ముందున్నట్టే ఆరోగ్యంగా వున్నారు — పుష్టిగా మెరు స్తున్న చర్మ సౌందర్యంతో తెల్లగా.

"అవునూ, నీ పులిపిరికాయ ఎంత ముద్దుగా వుంటుందో!"

ఆ కాయ నా కెంత కష్టం తెచ్చిపెట్టిందో అమ్మతో చెప్పకోలేకపోయాను.

డాక్టరు చేత కోయించుకోవచ్చని అందరూ అంటు న్నట్టుగా చెప్పేను.

"ఆ...డాక్టరా...కాని మచ్చ వుండిపోతూంది!" ఎంత శాంతము, ఎంత నిదానమో అమ్మది.

"మా సాయొకో పెళ్ళయాక కూడా పులిపిరితో ఆడుకుంటూ వుంటుందని మేం అనుకుంటాం, నవ్వు కుంటాం. ఏవమ్మా అంతేగదూ...?"

"అవునవును. నే నాడుకొనేదాన్నమ్మా."

"మేమూ అదే అనుకుంటాం."

"ఈ అలవాటు మంచిది గాదమ్మా నాకెలా వచ్చిందో గాని!"

"చిన్న పిల్లలికి యివి పుడుతూ వుంటా యమ్మాయ్...ఎవరికీ నువ్వు చూడలేదన్నట్టుంది?"

"నా పిల్లలికి రాలేదమ్మా"

"కొంచెం పెద్దవాళ్ళయాక యివి వస్తే [illegible] మ్మాయ్. నీకు కూడా యివి యిలాగే పుట్టినట్టున్నాయి" అమ్మ నాభుజం చూసి ఆనందంతో నవ్వింది.

నాకు బాగా గుర్తు. నేనప్పటికింకా చిన్నదాన్ని. ఊా అమ్మ, అక్కయ్యలు నా పులిపిరిని పట్టుకుని గిలిగింతలు పెట్టేవారు. అందుకే నేను కూడా దాంతో ఆడుకోవడం మొదలెట్టానా...?

నేను పక్కమీద పడుకుని పులిపిరితో ఆడు కుంటూ బాల్యంలోను, యవ్వనం అంకురించే వయసు లోను ఈ ఆట నాకెలా అనిపించేదో గుర్తు తెచ్చుకుంటు న్నాను.

చాలాకాలం అయిపోయింది దీనితో ఆడుకోటం మానేసి ఎన్ని ఏండ్లు! ఆశ్చర్యంగా వుంది.

నేను పుట్టిన నా యింట్లో, మీకు చాలా దూరంగా, నా యిష్ట ప్రకారం దీనితో ఆడుకోగలను. నన్నెవ్వరూ ఆపలేరు.

అయినా లాభమేమిటి?

నా వ్రేళ్ళు పులిపిరిని తాకగానే కళ్ళలో నీళ్ళు వచ్చాయి.

నేను యువతిగా వున్నప్పటి ఆ వెనకటి కాలం గురించి ఆలోచించాలనుకున్నాను. కాని పులిపిరిని తాకగానే నా కళ్ళముందు మీరే కనిపించారు.

భార్యగా నేను చెడ్డదాన్నని తిట్టవచ్చు, విడాకులివ్వ వచ్చు. మా యింటిలో పక్కమీదవుండగా నాకెందుకో యిలాంటి ఆలోచనలు వచ్చాయి.

తడిచిన తలదిండుని రెండోవైపు తిప్పేను. పులిపిరిని కలలో చూసాను.

నాకు మెలకువ వచ్చేటప్పటికి ఈ గది కేమయిందో నాకు తెలియదుగాని మీరున్నారు, మీతోబాటు మరో స్త్రీ కూడా వుంది. నేను తాగాను. సారాలో మునిగి వున్నానా అన్నంతగా తాగాను. మీతో ఏమిటో వాగేస్తు న్నాను.

నా చెడు అలవాటు మళ్ళీ వచ్చింది. నా కుడి చేతిని తిప్పి ఎప్పటిలాగానే ఛాతీకి రెండోవైపు తెచ్చేను. అవును, పులిపిరే, నా వేళ్ళలోకి వచ్చేసిందా? అవును, అంతే. ఓ వస్తువుని మనం తీసినట్టుగానే ఏ బాధా లేకుండానే అది నా చేతిలోకి వచ్చేసింది. వేచిన బటానీగింజలాగ కనిపిస్తూంది. అలిగిన పిల్లాడిలాగ నేను మీతో-'ఈ పులిపిరిని ముక్కు దగ్గరున్న మీ పులి పిరితో కలిపేయండి' అని అంటూ దాన్ని మీ ముందుంచేను.




నేను అరిచాను. పెద్దగా కేకలు పెట్టాను. మీ కాలరు పట్టుకుని మీ ఛాతీ మీద వేలబడ్డాను.

** ** **

నాకు నిద్రాభంగమయింది. అప్పుడు కూడా తలగడ తడిచి వుంది. నే నేడుస్తున్నాను. అయినా నాకెంతో తేలికగా వుంది. నెత్తిమీంచి బరువు దింపినట్టుంది.

కొంచెం సేపు అలా వుండి నవ్వుకున్నాను. ఆలోచిస్తున్నాను, పులిపిరికాయ నిజంగానే పోయిందా! దాన్ని తాకడం మంచిది కాదనిపించింది.

నా పులిపిరికాయకు సంబంధించి యింతే కథ... బటానీ లాగ నా వేళ్ళలో యింకా అది వున్నట్టుగానే అనుకోగలను.

మీ ముక్కు దగ్గరున్న పులిపిరి కాయ గురించి నే



ఇటీవల వెల్లూరు కళాభారతి నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలో వెస్ట్.జర్మనీ నర్తకి గీత, పాండిచ్చేరికి చెందిన నాట్య కళాకారుడు కృష్ణకుమార్

నెప్పుడూ ఆలోచించనూలేదు, మీతో దాని గురించి మాటాడనూ లేదు. అయినా ఈ విషయం నా బుర్రలోంచి బయటకు వస్తూన్నట్టుగా నాకనిపిస్తూంది. మీ పులిపిరి వాచిపోయి నా పులిపిరి కంటె పెద్దదయిందనుకోండి- అప్పుడెలా వుంటుంది? మీరు నన్ను బాగా సతాయించేవారు గదా!

వుండండి, ఓ సంగతి మరిచేపోయాను.

పులిపిరికాయ పట్టుకొని దానితో ఆడుకొనేటప్పుడు నా ముఖంలోని భావాలు చూస్తే మీ కసహ్యం అన్నారు. మీరన్న ఆ మాటలు నాయందు మీకున్న ప్రేమని తెలియజేస్తున్నాయి. పులిపిరిని తాకినప్పుడు నాలో వున్న చెడు భావాలు బయటికొస్తున్నట్టు నే ననుకొన్నాను. నా అనుమానమేమిటంటే నా తర్కం అర్థం కానప్పుడు ఈ బాధ్యత నా తల్లిమీద, అక్క చెల్లెళ్ళమీద పడుతుంది. నేను పులిపిరిని పట్టుకుంటూండే తొలి రోజులలో వాళ్ళే నన్ను వెన్ను తట్టి ప్రోత్సహించేవారు.

''ఇప్పటికి చాలా కాలమయుంటుంది. పులిపిరిని పట్టుకోవద్దని చేప్పేదానివి కదమ్మా'' నేను అమ్మతో అన్నాను.

''నిజమే, చెప్పేదాన్ని. కాని ఎన్నాళ్ళకిందటో కాదు!''

''ఎందుకమ్మా వద్దన్నావు?''

''ఎందుకేమిటి? అది మంచి అలవాటు కాదు.''

''పులిపిరితో ఆడుకుంటూన్నప్పుడు మీ కెలా అనిపిస్తాను?''

''అంత బావుండవు'' తల ఊపుతూ అమ్మ అంది.

''నిజమే. బావుండను. కాని ఎలా వుంటాను? బాధతో వున్నట్టు అనిపిస్తానా? చెడ్డగా అసహ్యంగా అనిపిస్తానా?''

''నేనిదేమీ ఆలోచించలేదు.''

''నాకు కోపం వస్తూందేదా?''

''ఏమో- నేనంతగా పట్టించుకోలేదు.''

''నువ్వూ, మిగతావాళ్ళు నన్ను యిబ్బంది పెట్టాలని, ఏడిపించాలని పులిపిరిని యిటూ అటూ లాగేవారా?''

''అవును, అలాగే అనిపిస్తూంది.''

ఇదే నిజమైననాడు నా తల్లి, అక్కచెల్లెళ్ళ ప్రేమని భద్రంగా దాచుకోడానికే నేనా పులిపిరితో ఆడుకునే దాన్ని అని అంటే తప్పేముంది, నన్ను అమితంగా ప్రేమించేవారి జ్ఞాపకార్థం నేనాపని చేస్తున్నట్టుకాదా?

ఈ విషయాలన్నీ మీతో చెప్పడం ఎంతో అవసరం. నా పులిపిరి విషయంలో మీరు మొదటి మంచీ కూడా తప్పుడు అభిప్రాయంతో లేరా?''

మీతో సంసారం చేసి యితరుల గురించి నేనాలోచించానా? నాలో మీకు నచ్చని భావాలు నా ప్రేమాలాపాలు కావా?- అని తరచు నేను ఆలోచిస్తూంటాను. ఎందుకంటే, వాటిని నేను మాటల రూపంలో కూర్చలేను గనక.

పులిపిరితో ఆడుకోవడమనే నా అలవాటు అతి సామాన్యమైనది. దీనికోసం ఏదో ఒక నెపం వెదకదలచలేదు. నేను మంచి భార్యను కాను అనిపించుకోడానికి అవసరమయే విషయాలన్నీ ఈ విధంగానే పెరిగి పెద్దవైనవి కాదా? మొదట్లో అవి మీ మీద నాకుండే ప్రేమకి గుర్తుగా వుండవచ్చు. ఆ తర్వాత మీరు వాటిని సరిగా అర్థం చేసుకోనందువల్ల అవే నా చెడుగుణాలు అయ్యేయేమో!

ఇవన్నీ రాస్తూ వుంటే మీరు నన్ను చెడ్డ భార్యగా గాని అనుకోరుగదా అనే భయం కలుగుతూంది. అయినా నాకు మరో దారి లేదు. ఈ విషయాలన్నీ మీతో చెప్పడం మంచి దనిపించింది, అందుకే చెబుతున్నాను. ●

## 'లింకా బుక్ ఆఫ్ రికార్డ్స్

శీతల పానీయాల సంస్థ బిస్లరీ బివరేజెస్ (పి.వి.టి.)' లిమిటెడ్ వారు 'లింకా బుక్ ఆఫ్ రికార్డ్స్' పేరుతో అంతర్జాతీయ స్థాయిని మించిపోయే రీతిలో ఒక పుస్తకాన్ని ముద్రిస్తున్నారు. 1987 మార్చి 31వ తేదీ వరకు వివిధ రంగాలలో అత్యున్నత రికార్డులు నెలకొల్పిన వ్యక్తుల, సంఘటనల, క్రీడల విశేషాలు దీనిలో పొందుపరుస్తారు.

ఇటువంటి గ్రంథం మన దేశంలో వెలువరించడం ఇదే ప్రథమం. భారత దేశంలో నివసిస్తున్నవారే కాక, విదేశాలలో వుంటున్న భారతీయులు కూడా ఏవైనా రికార్డులు సాధిస్తే వాటిని ఈ పుస్తకంలో పొందుపరుస్తారు.

## సమాచారం

ఇటువంటి పుస్తకాలకి వలె ఈ పుస్తకంలో రికార్డుల వివరాలు నమోదు చేయరు. 'రేటింగ్' పద్ధతిని ఉపయోగించి ఆయా వ్యక్తులు, క్రీడాకారులు, కళాకారులు నెలకొల్పిన అత్యున్నత రికార్డుల్ని దీనిలో పొందుపరుస్తారు. ఈ గ్రంథాన్ని వాణిజ్య ప్రచార నిమిత్తం ఉపయోగించబోమని ఈ సంస్థ ప్రకటించింది. అయితే వెలకే దీనిని విక్రయిస్తారు.

ఇంకా ఈ గ్రంథం గురించిన వివరాలు కావలసిన వారు ఈ క్రింది చిరునామాతో సంప్రతించవచ్చు.

లింకా బుక్ ఆఫ్ రికార్డ్స్,
డివిజన్ ఆఫ్ బిస్లరీ బివరేజెస్ ప్రైవేట్ లిమిటెడ్,
60, శివాజీమార్గ్,
న్యూఢిల్లీ- 110 015